# సినీతార భర్త

నేను పుట్టినతర్వాత ముప్ఫైఐదు కేలండర్లు చినిగాయి.

మూడవ అంతస్తులోని ఎయిర్ - కండిషన్డ్ గదిలో కూచుని, 'త్రీ కాసిల్స్' కాలుస్తో, తీరిగ్గా 'మల్లార్డ్' రేడియో నుండి వస్తున్న మధుర సంగీతం వింటూ ఆనందిస్తున్నాను.

ఆకస్మాత్తుగా యెందుకో ఆలోచనావాహిని గత జీవితం వైపు రాకెట్‌లా శబ్దవేగాన్ని, కాంతివేగాన్నీ, మించిన మనోగమనపువేగంతో పయనించసాగింది.

ఏంజేశాను? ఏమి ఆశయాలు సాధించాను? ఏమి ఆనందాలనుభవించాను? జీవిత చరమలక్ష్యం ఏమిటి?

ఏమిటో యెడతెగని తలపుల తుంపరల పరంపరలు!

వ్యర్థంగా బతికేననిపించింది. నాతోటివాళ్ళు లెక్చరర్లగానో, నాయకులుగానో, గుమాస్తాలుగానో పనిచేస్తున్నా కనీసం పదిమంది బిడ్డల తండ్రులగానో వున్నారు వాళ్ళకి జీవితంలో ఏదో- అయోమయపుదైనా - ఒక ధ్యేయం వుంది, దాన్ని అందుకుంటున్నామనే ఆత్మానందం, సంతృప్తి వున్నాయి.

నాకు పెళ్ళిలేదు పిల్లలు అసలే లేరని చెప్పాలి. జీవితాన్ని, ఏదో మధురస్వప్నంలా, అనుభవించాను. ఇష్టమొచ్చినట్టు చరించాను. ఏమేమో అర్థరహితంగా ఆచరించాను.

సర్వవిధాల వ్యభిచరించాను - మానసికంగా శారీరకంగా, ఆధ్యాత్మికంగా వ్యసనాలకు దాసుణ్ణయ్యాను. అపసవ్యాలను అసహ్యించుకోలేదు.

ఆఖరికి ఈ నా ఆశ్రమంలో విశ్రమిస్తున్నాను. ఆశ్రమమంటే మహర్షి ఆశ్రమం అనుకునేరు. ఒక్క భోజనంతప్ప అన్నీ విసర్జించి విరాగిలా బతుకుతో జీవిత ధ్యేయాన్ని గురించిన తపస్సనే అధ్యాయపు పంక్తులు పఠిస్తున్నాను.

బయట కారుహారన్ మోగింది. నేను ఇహలోకంలో పడ్డాను. అంతవరకూ చక్కగా పాడుతున్న జిక్కిపాటలు నా చెవుల్లోకెక్కి దూసుకుపోతున్నా నే సుషుప్తావస్థలో వాటిని గమనించలేకపోయాను.

మళ్ళీ హారన్! గుమ్మంలోంచి కిందికి చూడసాగేను

"... ఆయన ఇల్లు ఇదేనా!"

"అవునండి"

"ఇంట్లో వున్నారా?"

"ఆ"

"నడు – ఆయన్ని కలవాలి" అంటూ ఆగంతుకురాలు ముందుకు తోసుకుపోయింది. నౌఖరు తత్తరపాటుతో దారిచ్చాడు.

ఎవరబ్బా! బాగా పరిచయమైనట్టేవుంది. 'లిఫ్టు'మీద కిందికి దిగేను. విజిటర్సు రూం సమీపించేసరికే, వాడు చేతిలో కార్డుతో ప్రత్యక్షమయ్యాడు.

"సార్, ఎవరో ఆడమనిషి!"

కార్డు అందించాడు.

"దేవబాల"

ఎవరూ? దేవబాలా! ప్రఖ్యాత సినిమానటి!! నా గృహానికి విచ్చేసిందా!

నన్ను నేనే నమ్మలేకపోయాను నాలో చెలరేగిన వైరాగ్యం, సూర్యునికాంతిముందు చిమ్మచీకట్లులా, పారిపోయింది.

మెరపుతీగెలా సోఫామీదకూచున్న దేవబాల, నేను లోపలికి వెళ్ళగానే, లేచి నిలబడి, సవినయంగా నమస్కరిస్తూ సమీపించడానికి నెమ్మదిగా అడుగులు వేయసాగింది. నిలువెత్తు సజీవ శిలాప్రతిమలా, అప్సరసలా, ఉన్న ఆమె ఉనికి నన్ను ఊహాలోకాల్లోకి ఎత్తేసింది.

"నమస్తే"

మాటలు అప్రయత్నంగానే వొచ్చాయి.

"జ్ఞాపకం ఉన్నానా?"

చేతిని తనచేతులతో స్పర్శిస్తూ, సోఫాపై కూర్చుండబెడుతూ, నా ఆకారాన్ని తనివితీరా నేత్రాలతో త్రాగేస్తూ, తనూ కూర్చుంది.

నేను కళ్ళల్లోకి, సూటిగా, అర్థరహితంగా, దేన్నో తీవ్రంగా చదువుతున్నట్టుగా చూడటం తప్ప వేరేమీ చేయలేకపోయాను. ఆమె నన్నలా పరిశీలిస్తూంటే కొంచెం సిగ్గునాకే కలిగింది.

"జ్ఞాపకం లేక?" అన్నాను మంత్రముగ్ధుడిలా.

"అయితే ఇంకేం? నా జీవితాశయం నెరవేరినట్టే! అవునా?"

రెండు చేతులూ భుజాలమీదవేసి అవునా, కాదా! అన్నట్టు కుదిపింది.

నాలో విద్యుత్ ప్రవహించింది. అలసిసొలసి విశ్రాంతి తీసుకుంటున్న నా నరాల బిగువ తిరిగి విజృంభించసాగింది.

దేవబాల నిజంగా దేవబాలే! ఆవిడ అందంముందు ఎవరికీ మాటలు పెగలవు.

ఇంత వయస్సు ముదిరినా అంత అందాన్ని కలిగివుండడమే దేవతాస్త్రీ మూర్తి అనడానికి సాక్ష్యం.

నెమ్మదిగా లేచివెళ్ళి "డ్రైవర్! సామానులోపల పెట్టు" అంది.

నేను ఇహలోకంలోకి వచ్చి కుర్రవాడ్ని పిల్చి కాఫీ, టిఫిన్‌లకు ఆర్డరిచ్చాను.

"పైకివెడదాం రండి" అన్నాను.

"ముందు స్నానంచేసి బట్టలుమార్చుకోవాలి. అంత వరకూ కాఫీకూడా ముట్టను. ప్రయాణబడలిక ఎక్కువగా వుంది".

డ్రైవర్ సామానులు లోపలపెట్టాడు వాడికో రూపాయి ఇచ్చి కాఫీతాగమని పంపించాను.

దేవబాలకు బాత్‌రూం చూపాను. ఆకుపచ్చని జార్జెట్ చీరా, మఖమల్ జాకెట్టూ తీసుకుని వెళ్ళింది.

***

సరిగ్గా పదిహేనుసంవత్సరాల క్రిందటి మాట. అప్పుడే దేవబాల సినిమారంగంలో ప్రవేశించింది. అష్టకష్టాలుపడి అంత సౌందర్యం, సహజ మధురస్వరం కలిగివుండికూడా 'ఛాన్సు' కొరకైఎంతో తాపత్రయపడింది. మొదటిచిత్రం బాక్సాఫీస్ హిట్ అవడంతో తార అయికూర్చుంది అంతకు ముందు 'కెమెరా ఫేస్' కాదన్న వాళ్ళే, ఆమె ఇంటి చుట్టూ కార్లేసుకు తిరగసాగేరు. సినిమాతారల్లో అందగత్తె అవడం వల్ల ఇట్టే ప్రేక్షకులహృదయాలను చూరగొంది. ఆనతి కాలంలో అనంత యువకలోకానికి స్వప్న కాంత అయింది.

అప్పుడే దేవబాలపైన నాకూ ఆకర్షణ కలిగింది. ఆవిడ జీవిత విశేషాలకోసం సినిమాపత్రికలు చూడసాగాను. కొన్ని పత్రికలు పనిగట్టుకు దుష్ప్రచారంచేసేవి. అవంటే నాకు వొళ్ళు మండేది. అవి అల్లిన కథలు అసత్యాలనిపించేవి.

అప్పుడు నేను బి.ఏ. చదువుతున్నాను. కాలేజి చదువుకు తిలోదికాలిచ్చి మద్రాస్ పోదామనిపించింది. కాని ధైర్యం లేదు. పైన కాదనే పెద్దలెవరూ లేకపోయినా, ఆత్మధైర్యం చాల్లేదు.

ఐతేనేం? ఆవిడ ఫాన్ మెయిల్‌లో నా లేఖలూ కలిశాయి.

చాలారోజుల తర్వాత ఓకార్డు అందింది. "మీ ఉత్తరం... చాలా గొప్పగా ప్రేమను చాటారు... నేనూ ఒక జీవినే... ఇలాంటివి కుప్పలు తిప్పలుగా వస్తుంటాయి... మీ ఆదరం ఉంటే చాలు... పట్నంవొస్తే కలుస్తామన్నారు. వీలుచిక్కితే దర్శనమివ్వడానికి అభ్యంతరంలేదు... ప్రేక్షకులఅభిమానమే.... మా సంపాదన"

వందసార్లు చదివేను, దాన్ని అక్షరం అక్షరంమధ్యా అర్థంకోసం గాలించాను.

వేసవికాలంలో వెయ్యిరూపాయలు జేబులో వేసుకుని మద్రాస్ పయనమయ్యాను.

***

పదిరోజుల అనంతరంగాని ఇంటర్వ్యూ చిక్కలేదు..

ఆవేళ ఐదునిమిషాలే దర్శనమిచ్చింది. నేను నా మనోవేదనను వెళ్ళడించాను ఆ కొద్ది సమయంలోనే దేవబాల నవ్వింది. దేవకాంతల గజ్జలు ఘల్ ఘల్ మన్నట్టయింది నా మనస్సు ఝల్లుమంది.

"నాది క్షుద్రప్రేమ కాదు. నేను మిమ్మల్ని వివాహం చేసుకుంటాను" అన్నాను, వెర్రిగా, అమాయికంగా.

ఆమాట దేవబాలకు పెద్ద షాక్ నిచ్చింది. దెబ్బతిన్న లేడిలా సోఫాలో కూలబడింది. అలాంటి పదం ఎరగనట్టు.

నేను దగ్గరకూర్చుని సేదతీర్చాను.

అప్పటికి ఉదయం తొమ్మిదైంది. ఇంటిముందు స్టూడియోకారు ఆగింది.

దేవబాల త్వరగా కోలుకొని, శృంగారించుకుని స్టూడియోకి వెళ్ళబోతూ, ఇంకా అక్కడే కనిపెట్టుకుని వున్న నన్ను చూస్తూ, "మిస్టర్; రేపు సాయంత్రం ఆరింటికి రండి" అంది.

తర్వాత కారు చప్పుడుచేసుకుంటూ నిష్క్రమించింది.

నేను నెమ్మదిగా కదుల్తూ, గేటు వద్దనున్న దర్వాన్ చేతిలో ఐదురూపాయలు పెట్టి, వాడి సాల్యూట్ నందుకుని, నా కారు చేరాను. కారులో పోతున్నా నన్నమాటేగాని, నా హృదయం గాలిపటంలా ఎగిరిపోతోంది. దేవబాలమాటలు దాన్ని దేవతాలోకాల్లోకి తీసుకుపోతున్నాయి. బలంలేని దారంలా దాన్ని ఇహలోకంలోకి తేడానికి వృథాప్రయత్నం చెయ్యసాగాను. కారుడ్రైవింగ్ చేస్తూనే.

లేకపోతే ఏ ప్రమాదంలో చిక్కుతానో అనే భయం లేకపోలేదు.

***

మర్నాడు అన్నటైంకు అక్కడ సాక్షాత్కరించాను. దేవబాల తయారుగా వుంది. కారువద్దకు వచ్చి. హెూటల్ ఎవరెస్ట్, అంది.

అక్కడ ఫలహారాలు తీసుకుని, మెరీనాకి పోయేం బీచ్‌లో కొంతసేపు కాలక్షేపంచేసేం. ఆనాటి ఆనందం అమరసౌఖ్యాన్ని పోలింది. వేలకొలదీ ప్రేక్షకుల హృదయాధి దేవత దేవబాల ఓ ప్రక్కన, జీవితపు పోటుపాట్లు జ్ఞప్తికి తెచ్చే మహాసముద్రం ఎదురుగా, లౌడ్ స్పీకర్ నుండి అనాయాచితంగా వచ్చి, హెూరుగాలిలో కలిసే కమ్మని సంగీతం మరో వైపూ - స్వర్గ సౌఖ్యాన్ని తలదన్ని నట్టనిపించింది.

రాత్రి దేవబాల మూడో అంతస్థుపై ఆరబోసిన పిండిలావున్న పున్నమివెన్నెలను నేలపై కురిపిస్తున్న నెల రాజు; మినుకుమినుకుమంటూ వింతరంగుల్లో మెరిసే నక్షత్రాలు! తారాపథంలో మేఘడోలికలలో తేలుతున్నట్టయింది.

"నన్ను నిజంగా ప్రేమిస్తున్నారా?"

ఎవరో నన్ను శూలంతో పొడిచినట్టయింది ఎలా రుజువుచేసుకొనేది.

"ఇంత ఎత్తునుండి దుమికిచూపుతే నమ్మకం కలుగుతుందా?"

సిద్ధపడ్డాను.

"అమ్మో... నన్ను చంపుకుతిన్నట్టే"

ఆపింది ఆ స్పర్శతో సర్వయత్నాలు ఆగుతాయనుకుంటాను. యాంత్రికంగా ఆగాను.

"నేనింతవరకూ ఎవర్నీ ప్రేమించలేదు. ఎందుకో మీమీద, మీ పట్టుదలమీద, ఓ ఆకర్షణ కలుగుతోంది. ఇంతలా తమ వశంచేసుకున్న వాళ్లెవరూలేరు ఇంతవరకు. ఇదే నేమో ప్రేమ? ఎప్పటికీ ఇలా మీ సాన్నిధ్యంలో వుంటంతో, రెప్పపాటన్నా వేయక మీ ముఖారవిందాన్ని చూస్తో, ఇట్లా జీవితపుటంచు చేరాలనివుంది".

అమృత సుధారసం... చెవులనూ, మనసునూ సర్వశక్తులనూ సమర్పించి వినసాగేను. జన్మజన్మాల తప:ఫలితం దేవబాల సాన్నిహిత్యం.

"కాని..."

ఏదో ఉరుము. నామనసు చివుక్కుమంది.

"కాని..." కొసిరేను అదురుతూనే.

"ఆ సమయం రావాలి. రాగానే నేనే వచ్చి మీ పాదాల చెంత వాల్తాను. మీకు ప్రేమలో నమ్మకం ఉంటే నాలో నమ్మకంఉంటే మీ గ్రామం రేపుదయమే బయలుదేరి వెళ్ళండి. దేవుడిసాక్షిగా... నేను మిమ్మల్నే ప్రేమిస్తున్నాను. మిమ్మల్నే జీవితాంతం ఆరాధిస్తాను".

ఆ మాటలు ఒక ప్రక్క నాలో సంతోషాన్నీ, మరో ప్రక్క సంతాపాన్నీ కలిగించసాగేయి. చెప్పజాలని అనుభూతి! ఓక్షణం నిరుత్తరుణ్ణయ్యాను.

***

అదే మా ఆఖరికలయిక అవుతుందనుకున్నాను అట్లాగే పదిహేను సంవత్సరాలు వృథా నిరీక్షణ చేసేను.

పదిహేను సంవత్సరాలు! మానవజీవితంలో మాటలా దాదాపు నా యవ్వనకాలమంతా అర్థరహితమైన నిరీక్షణలో గడిపేను.

ఆనాటి కీనాడు మళ్ళీ దేవబాల నా కనుల ఎదుట తలవనితలంపుగా సాక్షాత్కరించింది.

"పైకి వెడదాం"

స్నానంచేసి అలంకరించుకుని వొచ్చిన దేవబాల బాహ్య స్ఫూర్తి కలిగించింది.

"రండి..." అన్నాను

దేవబాల కాలిస్లిప్పర్లు లిఫ్టుకేసి మళ్ళాయి. పైకి వెళ్ళాక నా డ్రాయింగ్ రూమ్‌లోకి

వెళ్ళేం. ఆ గదిచూసి దేవబాల నిశ్చేష్టురాలైంది. గదిగోడలపై రకరకాల బొమ్మలు - వివిధ చలనచిత్రాల్లో రకరకాల వేషాల్లో తీయించుకున్న వేర్వేరు పటాలు

"అధికమైన ప్రేమ వెర్రెత్తిస్తుందనుకుంటాను"

"ప్రేమకాదు, ఆరాధనండి"

"అందేమిటి. నేను మీదాన్నేగా!"

"ఏమో నాకే తెలీదు. మిమ్మల్ని చూస్తుంటే గౌరవవాచకాలు వాటంతటవే ఉబికివస్తున్నాయి. కొత్త వాటికోసం ఇంకా భాషలోని మాటలమూటల్నీ విప్పి వెతకాల్సివస్తోంది. ఐనా ఒక వస్తువు స్వంతమైనంతలో విలువ మారదుగా?"

- ఏమిటేమిటో అన్నాను.

దేవబాల నన్ను సమీపించి గడ్డంలోంచి వేళ్ళు పోనిచ్చి దువ్వసాగింది.

"నా పిచ్చి బాబులు..."

వక్షానికి అదుముకుంది. వింత అనుభూతికి నా కళ్ళు ఆనందభాష్పాల్తో నిండాయి.

"నీ ఆరాధనలోనే నా జీవితాన్ని గడిపేను"

గదిచుట్టూ కలయజూసింది. దేవబాలకళ్ళుకూడా చెమ్మగిల్లాయి.

"పాపిని; ఇన్ని సంవత్సరాల ఎడబాటును నా మనోవాంఛలకోసం మీ నెత్తిన రుద్దాను. ఆఖరుకు నేను పాదాల చెంత వ్రాలాను. ఈనాడు నేను సినీతారను కాదు. ఆ బాల వేరే. నేను మీ భార్యను. మీ చరణదాసిని. మీ సేవలో ఈ మిగిలిన జీవితాన్ని సమర్పించి ధన్యురాల్ని కాదలిచాను.

"ఏబదిలక్షలు సంపాదించాలి. అప్పుడే నచ్చిన ప్రియుడితో జీవించాలి. అదీ నేను అనుకున్నది. అదే నేడు నెరవేరిందీ. ఈనాడు మనకి ఈ జీవితంలో ఏ రకమైన ఆర్థిక బాధా వుండదు. మన ప్రేమజీవితానికి అడ్డుతగిలే 'విలన్'లు ఎవ్వరూ లేరు" అంది. కళ్ళల్లో ఎంతో సంతృప్తి కనపడింది. సోఫాపై పడుకుని తొడపై తలని ఆన్చి, కళ్ళల్లోకి చూడసాగేను. తలకింద సిల్కు చీర జారుతోంది.

కొద్దిగా దేవబాల లేపెదవులు...

***

కుర్రాడు తెచ్చిన ఫలహారాలు ముగించి, రేడియో వద్ద చేరేము.

ఆనాటి సంగీత కార్యక్రమములో శ్రీమతి దేవబాల పాడిన పాటలు (ఫిలింసంగీతం) ప్రసారం చెయ్యబడుతోంది.

నాలో ఏదో విపరీతభావం కలిగింది. నిజానికి ఈనాడు అనేది నా జీవితంలో సంభవం అని అనుకోలేదు. దేవబాల నన్ను లాలించి పంపించేసిందంతే! ఇలాంటి ప్రేమికులు

సినిమాతారలకు తండోపతండాలు. సముద్రంలోని నీటి బిందువులాంటి నన్ను తన్ను ముంచెత్తే ప్రేమజలధిలో గమనించగలదా? ఆ ఆశ ఎన్నడో అడుగంటి, భగ్న ప్రేమికునిగా, బరువుగా, చెప్పలేని తిరుగుళ్ళకు అనరాని అలవాట్లకు లోబడి, ఆఖరికి అలిసిసొలిసి, ఈ వైరాగ్యపు జీవితంలో కాలిడిన నాకు, ఆనాటి అందాలతార, నా హృదయాది దేవత, తొలిప్రేమలను నాలో కుసుమింపజేసిన దేవబాల ఈ విధంగా నాచెంతకు రాగలదని ఎన్నడూ కలలోకూడా ఆశించలేదు. పురాకృతజన్మఫలంవల్ల నేనామెను ప్రేమించాను; దానివల్లే ఆమెకూడా బదులుపలికింది, అప్పట్లో; తిరిగి ఏలోకాల్లోనో ఏరూపంలోనో కలుసుకుతీరతామనే గుడ్డినమ్మకం నా హృదయకుహరంలో గుడ్డి వెలుతురుగా మినుకుమినుకుమనేది.

"నీ పాటలే" ఆలోచనలమధ్య – అన్నాను.

ఊర్వశిలా నవ్వింది దేవబాల – ఆ ఒక్కనవ్వు చాలు – మనిషిలోని ప్రత్యణువుకూ వెయ్యేళ్ళు ఆనందోత్సాహాల్ని రగిలించటానికి.

"ఏదో ఆలోచిస్తున్నట్టున్నారు?"

"మిమ్మల్ని చూస్తూ పాతబాకీ వసూలు చేసుకుంటున్నాను".

"మళ్ళా... గౌరవవాచకం...?"

కాసేపు మౌనంలో మునిగాం. రేడియోపాటలు ఆగేయి. రేడియోస్విచ్ ఆఫ్‌చేశాను. టేబిల్‌ఫాన్ గిరగిరా తిరుగుతోంది. భ్రమణం లోకానికి సహజమైనట్టు – భూమి, గ్రహాలూ, బహుశా విశ్వంకూడా పరిభ్రమణం మీద ఆధారపడివుందేమో?

"దేవబాలా?" భుజంమీద చెయ్యి వేశాను, జంకుతో

"ఏమిటి?"

"అంతా విచిత్రంగా లేదూ?"

"ఏదంతా?"

"నీరాక"

"ఎందుకూ – నే నేనాడో ప్రతిన జేశానుగా"

"అవును. అయినా కలలా వుంది"

"అయితే ఆనాడు నామాట మీరు నమ్మలేదనుకుంటా"

"నమ్మాను. కాని... మనం ఏ దివ్యలోకాల్లోనో ఏదో వేర్వేరరూపాల్లో కల్సుకుంటామనుకున్నా. ఈ రకమైన కలయిక సాధ్యమని నా కలలోకూడా తోచలేదు"

"అవును అట్లాగే అనిపిస్తుంది మరి. ఈ రకమైన నిరీక్షణ అసాధారణమైనదే. అందులో మీ తప్పేమీ లేదు".

నా కళ్ళల్లోకి చూసింది, ప్రేమధారను రేడియేట్ చేస్తున్నట్టు. వేలుతో లేపెదవులను స్పర్శించసాగేను. వేళ్ళతో జుత్తుదువ్వేను. చెంపలపై నా చేతుల ప్రతిబింబాల్ని చూసుకున్నాను.

కళ్ళలో నా ప్రతిబింబాలు రెండు నిల్చివుండడం చూశాను. 'నా దేవబాల నా వద్దకే వొచ్చింది' సంతోషంతో మనస్సు గెంతసాగింది.

అకస్మాత్తుగా హృదయానికి హత్తుకుని నన్నెందుకో ముద్దుపెట్టుకుంది. కర్పూరపువాసన గుప్పుమంది.

"ఒక్క ప్రశ్న అడగవచ్చా?"

"ఒక్కటి కాదు; వంద అడగండి"

"ఎప్పటికీ నాతోనే వుంటావా? కలలో కనిపించినట్టుగా కలలో ముంచితేల్చి, మాయమవుతావా?"

తిరిగి జాలిగా నవ్వింది– ఊర్వశి కాలిమువ్వల సవ్వడి జాలిగా మ్రోగినట్టయింది.

"ఎప్పటికీ మీ కౌగిట్లోనే బంధింపబడివుంటానని వాగ్దానంచేస్తేనైనా మీకు నమ్మకం కుదురుతుందా?"

అమాయికపు ప్రశ్నకు సానుభూతిపూర్వకంగా జవాబిచ్చినట్టు అంది. నేను నా ప్రశ్నకు చింతించాను. అడుగుదామనుకున్న ప్రశ్నలు అంగుట్లోనే అడుగంటిపోయేలా వున్నాయి.

కాని ప్రయత్నించి అడిగేను:

"నాకు ఎడతెగని ఈ నిరీక్షణ నెందుకు పెట్టేవు? పదిహేనుసంవత్సరాలు మానవజీవితంలో మాటలా? ఇద్దరం కలిసివుంటే ఎంత హాయిగా జీవించివుందుం. యవ్వనంలో లేని ప్రేమపెన్నిధి యవ్వన ప్రాంగణాన్ని దాటి ముందడుగువేసే సమయంలో ఎందుకు? వాస్తవిక ప్రేమకు దూరమైన అధ్యాత్మిక ప్రేమను కాంక్షించేది మనం మన మేమీ ఋషులం కాముగా?"

దేవబాల చిటికెన వేలుతో చంద్రహారాన్ని పెనవెయ్యసాగింది ఆలోచనగా నేను ముఖపరిశీలనలో పడ్డాను.

అప్పుడంది: "మనం ఋషులంకాము; సాధారణ మానవులమే, కాని మీరు అప్పుడే నాతో ఉండిపోతే మనం ఏ కొద్ది నెలల్లోనే విడిపోయివుందుం"

"సంసార స్త్రీలు సినిమాల్లో ఎంతగా నటించి ఆ రంగాన్ని ఉద్ధరించాలని తాపత్రయపడ్డా, దానిలో చాలా చిక్కులు వున్నాయి. అసలు లోకంలో స్త్రీ పురుషసంబంధసస్యే చాలా క్లిష్టమైనదీ, సున్నితమైనదీని. ఐతే మానవ జాతి అదృష్టంవల్ల వివాహం అనే పద్ధతి కనుగొనబడి పెక్కుసమస్యలు తీరాయి. ఐతే దీనితోనే ముడివెయ్యబడివుంది. ఈ సంసారిక స్త్రీల కళారంగ ప్రవేశం కూడా!

"సినిమాజీవితాన్ని గడిపే వ్యక్తులగాథలు మీరు చాలా వినివుంటారు. ఒక మోస్తరుగా పేరులోకివచ్చిన తారల మాట కొంతవరకు మినహాయించినా తక్కిన స్త్రీల జీవితాలు నరక ప్రాయాలు; ఎప్పుడూ ముళ్ళకంపమీద ఉన్నట్టుంటుంది. మానసంరక్షణం ఓ సమస్య–

మానాన్నీ అభిమానాన్నీ వదులుకుని, అవమానాలను లెక్క చెయ్యని వాళ్ళను మినహాయిస్తే.

"కొందరు బుకింగ్సుకోసం, కొందరు పబ్లిసిటీ కోసం కొందరు వినోదంకోసం... కొందరు భుక్తికోసం రకరకాల దుర్వ్యసనాలకు దాసులవుతారు. స్త్రీని విలాస వస్తువుగా భావిస్తారు, పారిశ్రామిక వ్యక్తులు. స్త్రీలూ అంతే

"సినీరంగం పై కొక కళారంగంగానూ, స్వర్గధామంగానూ కనపడుతుంది. కాని సినీవ్యక్తుల్లో ఈర్ష్యలూ అసహనాలు, నటనలు, ద్రోహాలూ, కుత్సితాలు, మోసాలూ మొదలైన తెరవెనకాలి భాగవతాలు సామాన్యుల కవగతం కావు. ఊహించలేరు. విన్నా అర్థంచేసుకోలేరు.

"సినీతారలు చాటే పాతివ్రత్యం తెరలమీదే. సిని తారల భర్తలు వాళ్ళ నంటిపెట్టుకునే నీడలుమాత్రమే నీడలంత అచేతనులు".

"మీరు సాంసారిక స్త్రీలగా సినీరంగంలో ప్రవేశించి వాళ్ళనిగురించీ, సినీతారలయ్యాక వివాహితులైన వాళ్ళ గురించీ ఎన్నో కథలు వినుంటారు. అవన్నీ పూర్తిగా అబద్ధంకావు - కొంతవరకు కల్పనలున్నప్పటికీ"

"నిర్మలమైన మనస్సుతో ఈ కష్టాన్ని ఎదుర్కోడానికి మోసానికీ ప్రతిగా మోసాన్నే ప్రయోగించి గెలుపొందాలనే ప్రయోగంలో జయంపొంది చివరి కిక్కడికి వొచ్చాను.

"ఏ స్త్రీగాని, పురుషుడుగాని జీవితాన్ని ఏకాకిగా ఈదలేరు. అది ప్రకృతిరహస్యం. అందుకే ఏనాడైనా దాంపత్యజీవితాన్ని స్వీకరించి, ఎవరైనా గృహస్థా శ్రమంలో మనక తప్పదు.

"ఇన్ని రకాల ఈతిబాధల్నుండి మిమ్మల్ని విముక్తి చెయ్యడమేగాక, మీ నిర్మలప్రేమని జీవితాంతంవరకూ నిలుపుకుని, ఆరాధ్య దైవముగా ఆరాధించాలనే ఈ రాధ వేధనాభరిత బాధ"

- దేవబాల ముగించింది కళ్లలోకం కళ్ళముందు ఫిలింరీలుగా తిరిగిపోయింది.

జీవితానికి పరమలక్ష్యమైన ఒక సత్యాన్ని తెల్సుకున్నాననే ఆనందంతోబాటు దేవబాల నన్ను ఆరాధ్య దైవంగా ఎంచుకుంటోందనే గొప్పభావం నా మనస్సుని ముంచెత్తింది.

నే నామెను ఆనందడోలికలల్లో ముంచెత్తడానికి చేతులుచాచాను.